క్లుప్తంగా

మునగ మొక్కల పంపిణీ



రైతులకు మునగ మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: వన మహోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా మండల కేంద్రంలో పలు గ్రామాల రైతులకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం 10వేల మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మునగసాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే పర్యా వరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ ఎస్.అప్పారావు, ఎంఈఓ సీహెచ్.కూర్మారావు, ఉపాధిహామీ ఏపీఓ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, మల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి పరిశీలన



శాశనపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

జామి: మండలంలోని శాశనపల్లి–పెద్దవేమలి మధ్య గెడ్డను జేసీ సేతుమాధవన్ గురువారం పరిశీలించారు.గెడ్డపై వంతెన నిర్మాణానికి నివేదికలు తయారు చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌ను జేసీ ఆదేశించారు. 110 మీటర్ల పొడవైన వంతెన నిర్మించాల్సి ఉంటుందని ఎస్ఈ జేసీకి వివరించారు. పూర్తి అంచనాలతో నివేదిక అందిస్తామని తెలిపారు. శాశనపల్లి గ్రామస్తుల సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో సందర్శించామని చెప్పారు. జేసీ వెంట పీఆర్ డీఈ స్వామినాయుడు, తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీఓ అప్పలనాయుడు,స్థానిక సర్పంచ్ వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



హౌసింగ్ ఏఈ రాజేష్

దత్తిరాజేరు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వరప్రసాద్,ఆర్ఐగా నారాయణరావు స్థానిక రెవె న్యూ కార్యాలయంలో, హౌసింగ్ ఏఈగా కె.రాజేష్ గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ, ఆర్ఐకి రెవెన్యూ సిబ్బంది, హౌసింగ్ ఏఈకి గృహ నిర్మాణశాఖ సిబ్బంది స్వాగతం పలికారు.

రూ.1.06 లక్షలు పలికిన లడ్డూ

వేపాడ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బల్లంకి గ్రామంలో అమ్మవారి పీఠం వద్ద బుధవారం రాత్రి భవానీ భక్తులు అంబలం పూజ నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 22 కిలోల లడ్డూ ప్రసాదంతో పాటు అరతులం బంగారం, 6 తులాల వెండి అభరణాలకు వేలం పాట నిర్వ హించగా గ్రామానికి చెందిన నీలంశెట్టి సత్యనారాయణ రూ.1.06 లక్షలకు దక్కించుకున్నారు. పురోహితులు మేడపాటి కిశోర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి



ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

బొండపల్లి: పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు సూచించారు. జాతీయ పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఒంపల్లి హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత ఆధార్ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసుకోవడంతో పాటు, కార్డుల్లో మార్పులు,చేర్పులు ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్లను లింక్ చేయడం వంటి సేవలను స్థానికులతో పాటు బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన 150 మంది ఉచితంగా పొందారు. గజపతినగరం సబ్ డివిజన్ ఐపీఓ బొద్దుల ఉపేంద్ర, మొయిల్ వాచర్ కూనుబిల్లి ఈశ్వరరావు, ఒంపల్లి బీపీఎం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ ప్రమీల, స్థానిక నేతలు

గుర్ల: మండలంలోని పాలవలసలో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు గురువారం భూమిపూజ చేశారు. మండల పరిషత్, ఉపాధి హామీ పథకం నిధులు రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఎంపీపీ చెప్పారు. మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనువాసరావు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము, స్థానిక నేతలు పెద్ద అచ్చనాయుడు , పెనుమజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు

- తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన దిగుబడి
- పెరిగిన పెట్టుబడి, తగ్గిన గిట్టుబాటు ధర
- ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు
- ఏడు నుంచి పది క్వింటాళ్ల లోపే వచ్చిన దిగుబడి
- మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర రూ.7,300
- రూ.10 వేలకు పెంచితే తప్పపెట్టుబడి కూడా రాదంటున్న అన్నదాతలు



ఎన్.జి.ఆర్.పురంలో పత్తిని ఎండబెడుతున్న రైతులు



తమ్మారాయుడుపేటలో ఇంటి వద్ద పత్తి వలుస్తున్న రైతులు

గజపతినగరం: వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, తెగుళ్ల విజృంభించడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పత్తి పంటకు సరైన దిగుబడి రాకపోవడం, పంటకు గిట్టు బాటు ధర లేక పోవడంతో గజపతినగరం సబ్ డివిజన్‌లో రైతులు తెల్లబోతున్నారు. జూలైలో పంట వేసిన తర్వాత ఆగస్ట్ వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, పంటచేతికి వచ్చిన సమయంలో భారీ వర్షాలు కురవ డం, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో విజృంభించిన తెగుళ్ల వల్ల పంట దిగుబడి అనుకున్న స్థాయిలో రాలేదని అన్నదాతలు చెబుతున్నా రు. గజపతినగరం వ్యవసా యశాఖ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లో ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగువిస్తీర్ణం లక్ష్యం 492 హెక్టార్లు కాగా ఈఏడాది 380 హెక్టార్లలో రైతులు సాగు చేశా రు. గజపతినగరం మండలంలోని శ్రీరంగ రాజపురం, ఎం.గుమడాం, గంగచోళ్లపెంట, తమ్మారాయుడుపేట, గుడివాడ, దత్తిరాజేరు మండలంలోని వంగర, మానాపురం, పోరలి, గడసాం, భూపాలరాజపురం, దాసు పేట, మెంటాడ మండలంలో ఆంద్ర, లోతుగెడ్డ, కొండలింగాలవలస తదితరగ్రామాల్లో ఈ పంట ఎక్క వగా సాగు చేశారు.ఎకరానికి దుక్కులు, విత్తనాలు, పురుగు మందు లు, కూలీల ఖర్చు కలిపి రూ.20వేలకు పైగానే అయ్యిందని రైతులు అంటున్నారు. అది కూడా ఇంటిల్లపాది కష్టపడితే రూ.20 వేలు అయ్యిందని, అన్ని పనులకూ కూలీల ను పెడితే మరో రూ.5 వేల వరకు ఖర్చు అయ్యేదని చెబుతున్నారు. పంట ను గులాబీ రంగుపురుగు, ఇతర తెగుళ్ల ఆశించడంతో పురుగుమందులు అధికంగా వినియో గించడంతో ఖర్చు పెరిగిపోయింది. తెగుళ్ల ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరానికి ఏడు నుంచి పది క్వింటాళ్ల మధ్యే దిగుబడి వచ్చింది. గతనెల ప్రారంభంలో రూ.8,300 వరకు ఉన్న క్వింటాల్ పత్తి ధర ప్రస్తుతం రూ.7,300 కు పడిపోయింది. ధర రూ.10 వేలు చేస్తే కాని గిట్టుబాటు కాదని, పెట్టుబడికి తగిన విధంగా దిగుబడి, ధర లేకపోవడంతో నష్టాలు తప్పడం లేదని అన్న దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో పత్తి సాగు వివరాలు(హెక్టార్లలో)

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం	సాగు చేసింది
గజపతినగరం	142	167
దత్తిరాజేరు	263	132
మెంటాడ	86	81
బొండపలి	01	0

రూ.10వేలు చేస్తేనే గిట్టుబాటు



ఈ ఏడాది పత్తి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఎకరానికి ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు వచ్చింది.పెట్టుబడి ఎకరానికి రూ.20 వేల వరకు అయ్యింది. మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర ప్రస్తుతం రూ.7,300 ఉందని విన్నాం. ధరను 10వేలు చేస్తేనే గిట్టుబాటు అవుతుంది. లేకుంటే అప్పులు తప్పవు.

దనాన రామునాయుడు, తమ్మారాయుడుపేట, గజపతినగరం మండలం

కొన్ని పంచాయతీలకే పనులు మంజూరు చేస్తే ఎలా..?

- గ్రామసభల్లో తీర్మానించిన పనులను ఎందుకు మంజూరు చేయలేదు..?
- సర్పంచ్‌లు, ఎంపీటీలతోనే పనులు చేయించాలి
- అధికారుల తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల మండిపాటు



పనుల వివరాలను వెల్లడిస్తున్న పంచాయతీరాజ్ జేఈ చంద్రశేఖర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): మండలంలో 30 పంచాయతీలు ఉండగా 14 పంచాయతీలకు మాత్రమే సిమెంట్ రోడ్లు మంజూరు చేస్తే మిగతా పంచాయతీల సంగతేంటని మండలంలోని పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పంచాయతీరాజ్ జేఈ చంద్రశేఖర్‌ను నిలదీశారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ముందుగా వ్యాపార దిగ్గజం రతన్‌టాటా మృతిపట్ల శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. పంచాయతీరాజ్ జేఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో ఇటీ వల జరిగిన గ్రామసభల్లో 675 పనులకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించగా, 14 పంచాయతీల్లో 56 సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. దీనికి వెదుళ్లవలస, తాటిపూడి, కాపుశంభాం తదితర పంచా యతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్పందిస్తూ గ్రామసభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజల సమక్షంలో గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించి తీర్మానం చేశామన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము తీర్మానం చేసిన పనులను ప్రాధాన్యతాక్రమంలో మంజూరు చేయాల్సి ఉండగా, వాటిని పక్కన పెట్టి ఎవరో చెప్పిన పనులను, ఎవరికోసమో మంజూరు చేస్తే ఇక గ్రామసభలు నిర్వహించడం, సర్పంచ్ లు,ఎంపీటీసీ సభ్యులుగా తాము ఉండడం ఎందుకని ప్రశ్నించారు. మంజూరైన కొన్ని పనులను సైతం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోనే చేయించాలన్నారు. జేఈ స్పందిస్తూ ప్రస్తుతానికి 14 పంచాయతీలకు పనులు మంజూరయ్యాయని, మిగతా పంచాయతీలకు రెండో దశలో మంజూరవుతాయని తెలిపారు.

ఇష్టమొచ్చినట్లు వీఓఏలను తొలగిస్తారా..?

వెలుగు ఆధ్వర్యంలో పని చేస్తున్న వీఓఎలను తొలగించాలని ప్రభుత్వం ఏమైనా ఏమైనా జీఓ విడుదల చేసిందా అని వెలుగు ఏపీఎం నారాయణరావును సభ్యులు ప్రశ్నించారు. ఏపీఎం స్పందిస్తూ ప్రభుత్వం సర్క్యులర్ –64 విడుదల చేసిందని, తొలగించేందుకు కొంత వెసులబాటు ఉన్నట్లు సూచనప్రాయంగా తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వీఓఏను తొలగిం చాలంటే ముందుగా గ్రామైక్య సంఘ సభ్యులతో గ్రామసభ నిర్వహించి తీర్మానం చేశాకే చర్యలు తీసుకోవాలని, ఇష్టమొచ్చినట్లు తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు గత నాలుగు సర్వసభ్య సమావేశాలకు హాజరు కాకపోవడంపై ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాములనాయుడు,రామకృష్ణరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్, రెవెన్యూ సమస్యలపై దృష్టిసారించండి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కళా వెంకటరావు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం: గ్రామాల్లో విద్యుత్, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. పదుల సంఖ్యలో రైతులు వ్యవసాయబోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించా లని కోరారు.పలువురు రైతులు తమభూముల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పు చూపిస్తున్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. బుధరాయవలస గ్రామ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు వేసి తీగలు వేయలేదని, వెంటనే తీగలు వేయాలని, అలాగే బుధరాయవలస పోలీస్‌స్టేషన్ ముందు సీసీరోడ్డు పూర్తిగా శిథిలమైందని, మళ్లీ సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు సరిధి రామునాయుడు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గాదెలమర్రివలస గ్రామానికి చెందిన సుమ్మల గణపతి, ఆయన భార్య లక్ష్మి దివ్యాంగుడైన వారి కుమారుడికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు.ఎంపీడీఓ జి.భాస్కరరావు, మాజీ ఎంపీపీలు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, టీడీపీ నాయకులు తాడ్డి చంద్రశేఖర్, కెంగువ ధనుంజయ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో అన్నదానం



చైతన్య మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సుబ్బలక్ష్మి ట్రస్టు ప్రతినిధి శివ

కొత్తవలస: దుర్గాష్టమి సందర్భంగా మండల కేంద్రానికి చెందిన సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు ఆశ్రమాల్లో గురువారం అన్నదానం నిర్వహించారు.పెందుర్తి మండలంలోని లయోలా వృద్ధాశ్రమంలో120 మందికి, కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో 45 మందికి, బలిఘట్టాంలోని న్యూహోప్ అనాథాశ్రమంలో 40 మంది పిల్లలకు భోజనాలు అందజేశారు. ట్రస్టు ప్రతినిధి కనకాల శివ, ఆయా ఆశ్రమాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవలో ముందుండాలి



కొత్తవలస: చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో మాట్లాడుతున్న జడ్జి విజయచంద్ర



చీపురుపల్లి: సీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

కొత్తవలస: దివ్యాంగుల సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని కొత్తవలస కోర్టు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ విజయచంద్ర సూచించారు.మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ దివ్యాంగులకు సేవచేసే భాగ్యం కొంతమందికే దక్కుతుందన్నారు. చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమం నిర్వాహకులు బోజింకి సన్యాసిరావును అభినందించారు. మానసిక ఆరోగ్యసమస్యలను ఎదుర్కొనేందుకు యోగా చేయాలని దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు డి.శ్రీనివాస్,జి.ఎస్.నాయుడు, జి.వెంకటరమణ, జి. కృష్ణ,ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలి

చీపురుపల్లి: ప్రతి ఒక్కరిలోనూ మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో వ్యక్తులు,సమాజం, వ్యవస్థలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యాయవాదులు కె.జగదీశ్వరరావు, కె.నాగేశ్వరరావు అన్నారు.ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో మానసిక ఆరోగ్యంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు ఎం.వి.నాయక్,కుమార్,శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



బొండపల్లి: పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

బొండపల్లిలో...

బొండపల్లి: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో గజపతినగరం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు మానసిక రోగుల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలు, హక్కుల గురించి వివరించారు.బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్. సాయికుమార్,న్యాయవాదులు సాయిశేఖర్, వాసుదేవరావు,వైద్యాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

దండాలమ్మ...దుర్గమ్మ

దేవీ నవరాత్రి ఉత్సవాలు చీపురుపల్లి,గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో వాడవాడలా వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం పలుగ్రామాల్లోని ఆలయాలు, దేవి మండపాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చీపురుపల్లి కనకమహా లక్ష్మి ఆలయంలో అమ్మవారికి అష్టోత్తర శత కళశాభిషేకం, లక్ష కుంకుమార్చన పూజలు, చండీ హోమం చేశారు. బొండపల్లి మండలం, దేవుపల్లిలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, కొవ్వాడపేటలో రామాలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. జామి మండలం, అలమండ గ్రామంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జామి బజారు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు శాకంబరిగా, లక్కవరపుకోట రామాలయం వద్ద మండపంలో అమ్మవారు మహాగౌరి అవతారంలో దర్శనమిచ్చారు.

– చీపురుపల్లి/బొండపల్లి/వేపాడ/ జామి/:లక్కవరపుకోట



చీపురుపల్లి: చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బొండపల్లి: దేవుపల్లిలోని రాజారాజేశ్వరీదేవి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



చీపురుపల్లి: చీపురుపల్లిలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న కనకమహాలక్ష్మి అమ్మవారు



జామి: జామి బజారుసెంటర్‌లోని మండపంలో శాకంబరిగా అమ్మవారు



వేపాడ: వల్లంపూడి షిర్డీసాయి ఆలయంలో అమ్మవారికి కరెన్సీనోట్ల అలంకరణ



జామి: అలమండలో విజయదుర్గ ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



లక్కవరపుకోట: ఎల్.కోట రామాలయంలో మహాగౌరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



బొండపల్లి: కొవ్వాడపేటలో చండీహోమం చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయంలో అష్టోత్తర శత కళశాభిషేక పూజలు

దసరా సంబరాలు



లక్కవరపుకోట: కొట్యాడలో బాణాలతో సందడి చేస్తున్న విద్యార్థులు



బొండపల్లి: వేంద్రాంలో బాణాలు పట్టుకుని పాటలు పాడుతున్న విద్యార్థులు

లక్కవరపుకోట: చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలారి, కొట్యాడ గ్రామాల్లో దసరా సంబరాలను గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు గుమ్మడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు బాణాలను చేతబట్టి దసరా పాటలు, పద్యాలు పాడుతూ ఇంటింటికీ వెళ్లి సందడి చేశారు. తలారి గ్రామం మీదుగా వెళుతు న్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విద్యార్థులతో ముచ్చటించి సందా అందజేశారు.

వేంద్రాంలో..

బొండపల్లి: మండలంలోని వేంద్రాం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం దసరా సంబరాలు నిర్వహించారు. బాణాలు చేతపట్టుకుని ఇంటింటికీ వెళ్లి దసరా పాటలు పాడుతూ పత్రి జల్లుతూ సందడి చేశారు.

సమస్యలు పరిష్కరించేందుకే..



గుర్లలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. గంట్యాడ మండలంలోని గింజేరు, గజపతినగరం మండలంలోని సీతారామపురం, గుర్ల మండల కేంద్రంలో గురువారం ఆయా మండల అధికారులు గ్రామసందర్శన చేశారు. ముందుగా సభలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. గుర్ల అంగన్‌వాడీ కేంద్రం గర్భిణులకు సీమంతం చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గంట్యాడ/ గుర్ల/ గజపతినగరం

ముగిసిన శిక్షణ



వేపాడ: ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లతో ఎంపీడీఓ సూర్యనారాయణ, అధికారులు



బొండపల్లి: శిక్షణ పూర్తి చేసుకున్న ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లతో ఎంపీడీఓ గిరిబాల, అధికారులు



గజపతినగరం: ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో ఎంపీడీఓ కల్యాణి

గ్రామాభివృద్ధి ప్రణాళికలు, పంచాయతీ సమావేశాలు, పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, పంచాయ తీరాజ్ చట్టాలు,వీధి దీపాల ఏర్పాటు, తాగునీటిసరఫరా, పంచాయతీల ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై బొండపల్లి, వేపాడ, గజపతినగరం మండల పరిషత్ కార్యాలయాల్లో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఎంపీడీఓలు జి.గిరిబాల, సూర్యనారాయణ, బి.కల్యాణి మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల అభివృద్ధిలో అమలు పరచడానికి కృషి చేయాలని కోరారు. ఆయా మండలాల ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

– బొండపల్లి/వేపాడ/గజపతినగరం